

ప్రభుత్వ స్థలంలో వెలసిన షెడ్డును నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ షెడ్డు కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెడతామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 422లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన షెడ్డును సోమవారం తహసీల్దార్ రవీందర్‌దత్ ఆధ్వర్యంలో ఎక్సకవేటర్‌తో కూల్చివేశారు. కొంత కాలంగా దీనిపై పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. దాంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నేలమట్టం చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాముద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బీరప్పస్వామి బోనాల పండుగలో కనకాల శ్యాం కురుమ తదితరులు

ఘనంగా బీరప్పస్వామి బోనాల ఉత్సవం

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): కురుమ కులస్థుల ఆరాధ్య దైవం బీరప్పస్వామి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలంగాణ బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు కనకాల శ్యాం కురుమ అన్నారు. మన్సూరాబాద్‌లోని కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బీరప్పస్వామి బోనాల పండగ భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కనకాల శ్యాం తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు శ్యాంను ఘనంగా సన్మానించారు.



సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సోమవారం ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఎస్.శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.జుమ్మికిలాల్, ఉపాధ్యక్షులుగా ఎం.నాగేందర్‌రెడ్డి, బీ.రామకిషన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీ.యాదగిరి, కోశాధికారిగా బీ.శ్రీధర్‌రెడ్డి, సహాయ కోశాధికారిగా ఎన్.రవి, కార్యవర్గ సభ్యులుగా కె.కేధారి, ఎం.రాజేష్‌రెడ్డి, పీ.ప్రదీప్‌కుమార్, ఎస్.దయాకర్, బీ.హనుమంతులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా నాట్యమండలి కళాకారుడు చిన్నాకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్యమండలి కళాకారుడు చిన్నా 3వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ నేతలు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎన్ఆర్ కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ చిన్నా కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాలచారి, నర్సింహ, ప్రసాద్, యాదగిరి, నారాయణ, పుల్లయ్య, నవనీత, దేవమ్మ, నిరంజన్, రాముడు, గణేష్, రాములు, మధు, వినోద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప, డాక్టర్ విజయబాబు, వేదకుమార్, తదితరులు

వీరగల్లు శిల్పాలను పరిరక్షించాలి: డాక్టర్ చెల్లప్ప

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో వీరగల్లు శిల్పాలను పరిరక్షిస్తున్నట్టుగానే రాష్ట్రంలో కూడా వాటిని పరిరక్షించాలని డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ.భద్రగిరీష్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రాసిన త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు (గణపతిదేవుని సంభాషణ-రుద్రమకీల్గుంటె) పుస్తకావిష్కరణ జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు మాట్లాడుతూ త్రిపురాంతకంలో ఎన్నో శిల్పాలు ఉన్నాయని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు మన చరిత్రను యూరోపియన్లు వారి దృక్పథంతో రాశారని, వారి గొప్పతనం గురించి అందులో పొందుపర్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను మరచిపోయే విధంగా అప్పటి పాలకులు చేశారని అన్నారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకుడు వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నడిపిస్తున్న దేశాలకన్నా మన దేశానికి ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. ప్రతి గ్రామం ఒక మ్యూజియమేనని అన్నారు. చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి భావితరాలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వారసత్వ శాఖ మాజీ ఉప సంచాలకుడు సముద్రాల శ్రీరంగాచార్య, కవి, చరిత్రకారుడు తురిమెల్ల శ్రీనివాస్ ప్రసాద్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, ఎం.స్వామి పాల్గొన్నారు.

6 నుంచి నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు



మాట్లాడుతున్న డాక్టర్ సత్యం శ్రీరంగం

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలకు నగరం వేదిక కానుంది. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో జరిగే ఈ పోటీల్లో 26 రాష్ట్రాల నుంచి 700 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.క్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు క్రిష్ణరాజ్ పుత్, చిత్రా షినాయ్, కోశాధికారి ఎస్‌కే.జమీల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈనెల 25న హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో రాష్ట్ర పురుషులు, మహిళల త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అదే రోజు చాంపియన్‌షిప్‌కు సంబంధించిన అధికారిక జెర్సీ, లోగోను ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చాంపియన్‌షిప్ పోటీల కమిటీ చైర్మన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే వణుకే..

- శంకేశ్వర్‌బజార్ బస్తీకి ముంపుభయం
- అనాలోచితంగా వరద నీటి కాలువ నిర్మాణం
- నాలా ఆక్రమణలు, అస్తవ్యస్తంగా పూడికతీత పనులు



మురుగునీరు దుర్గంధంగా మారిన శంకేశ్వర్‌బజార్ బస్తీ

సైదాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం పడినా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్‌బజార్ బస్తీవాసులు భయంతో వణికిపోతున్నారు. వర్షం వస్తుందంటే ముంపునకు గురై జలదిగ్బంధంలో చిక్కుకుపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు. వరదనీటి కాలువ(బాక్స్‌డ్రైన్) నిర్మాణ పనుల్లో అధికారులు చేపట్టిన అనాలోచిత చర్యలు ప్రజల పాలిట శాపంగా మారింది. సింగరేణి చెరువు ఎగువ ప్రాంతాలకు వరద ముంపు లేకుండా చేపట్టిన బాక్స్‌డ్రైన్ కాలువను నాలాలో కలుపడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే నాలాల ఆక్రమణ, అస్తవ్యస్తంగా పూడికతీత పనులతో కుదించుకుపోయి వరద ముంపు సమస్యతో అవస్థలు పడుతున్న శంకేశ్వర్‌బజార్ బస్తీవాసులకు తాజాగా వరద కాలువను కలుపడం ఇబ్బందికరంగా మారింది. పాతబస్తీ, చంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, చంపాపేటల మీదుగా వరద నీరును నేరుగా నాలాలో కలిపారు. దీంతో భారీగా వచ్చే వరద ఉధృతికి శంకేశ్వర్‌బజార్ నాలా తట్టుకునే స్థాయిలో లేదని స్థానికులు వాపోతున్నారు.



కుదించుకుపోయిన శంకేశ్వర్ బజార్ నాలా

చిన్నపాటి వర్షానికే..

గురు, శనివారాలలో కురిసిన చిన్నపాటి వర్షానికే వరదతో పాటు మురుగునీరుతో బస్తీని ముంచెత్తింది. ఇళ్లలో వచ్చి చేరుతుంది. మూడు రోజులుగా రోడ్లపై నిలిచిన మురుగునీరుతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత సంవత్సరం శంకేశ్వర్‌బజార్ నాలాలో బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టవద్దని స్థానికులు పెద్ద ఎత్తున అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల జోక్యంతో కొన్ని షరతులతో ఎస్ఎన్‌డీపీ అధికారులు అంగీకరించారు. పనులు పూర్తయ్యాయి, కానీ వరద సమస్య మరింత జఠిలంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

అధికారులు కొందరికి ప్రయోజనం చేకూర్చే క్రమంలో బస్తీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. నాలా వెడల్పు చేయకుండా వరదనీటి కాలువ కలుపడం దారుణం. భారీగా వచ్చే వరద ఉధృతిని నాలా గుండా వెళ్లే అవకాశం ఉందా? అనే విషయాన్ని అధికారులు పునరాలోచించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.

\- ప్రకాశ్, శంకేశ్వర్‌బజార్ బస్తీ

పనులు సక్రమంగా చేపట్టలేదు

బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు సక్రమంగా చేపట్టలేదు. దీంతో వరద, మురుగునీరు సాఫీగా వెళ్లక తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుంది. బాక్స్‌డ్రైన్ నిర్మాణం, నాలాల పూడికతీత అస్తవ్యస్తంగా మారడంతో ఏ చిన్నపాటి వర్షం వచ్చినా ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నాం. రాబోయే రోజుల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

\- రాములమ్మ, శంకేశ్వర్‌బజార్ బస్తీ



హయత్‌నగర్‌లోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు



తల్లి పరీక్షకు వెళ్లడంతో తండ్రి సంరక్షణలో చిన్నారులు

ప్రశాంతంగా టెట్

హయత్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) హయత్‌నగర్‌లో సోమవారం ప్రశాంతంగా జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భాగ్యలత అరుణోదయకాలనీలోని ఐయాన్ డిజిటల్ సెంటర్, కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులు పరీక్షలు రాశారు. మొదటి సెషన్ ఉదయం 9గంటల నుంచి 11.30 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు జరిగాయి. సెంటర్‌లో మొత్తం 985మంది అభ్యర్థులకు గాను 888 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 97మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ సారి కూడా పెద్ద సంఖ్యలో మహిళలు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు ఉదయం 9గంటలకే ఉండడంతో అభ్యర్థులు ఉదయం 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మహిళలు తమ చంటి పిల్లలు, భర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. పరీక్ష సమయంలో చిన్న పిల్లలు వారి కుటుంబ సభ్యుల సంరక్షణలో ఉన్నారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో..

అబ్దుల్లాపూర్‌మెట్: కుంట్లూర్ పల్లవి ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో 100 మంది అభ్యర్థులకు గాను 75 మంది హాజరై పరీక్ష రాశారు. 25మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు అయ్యారు. అభ్యర్థులు వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారు. ఉదయం 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 9గంటలకు పరీక్ష హాల్‌లోనికి అనుమతించారు.

నాగోల్ సీఐఓఎస్ డిజిటల్‌లో..

కొత్తపేట: కొత్తపేట న్యూనాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రై.లి.లో సోమవారం టెట్ ప్రశాంతంగా జరిగింది. సీఐఓఎస్ డిజిటల్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన 321మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కేంద్రంలో ఉదయం 185మంది అభ్యర్థులకు గాను 157మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185 మందికి గాను 14మంది అభ్యర్థులు హాజరయ్యారు.



పరీక్షా కేంద్రం వద్ద గుమికూడిన అభ్యర్థులు

ఇయాన్ డిజిటల్ జోన్‌లో..

వనస్థలిపురం: ఎల్బీనగర్‌లోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో ఉదయం షిఫ్ట్‌లో 879మంది అభ్యర్థులకు గాను 779మంది అభ్యర్థులు హాజరు కాగా 100మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్‌లో 880మంది అభ్యర్థులకు గాను 661మంది హాజరు కాగా 219 మంది గైర్హాజరు అయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద కాసేపు ట్రాఫిక్ జామ్ అయింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులతో పాటు వారి వెంట వచ్చిన వారితో పరీక్షా కేంద్రం వద్ద సందడిగా మారింది.



గాయని ఎస్పీ శైలజను సత్కరిస్తున్న అతిథులు

ప్రముఖ గాయని ఎస్పీ శైలజకు 'చక్రవర్తి జీవనసాఫల్యం' ప్రదానం

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో సుస్వరవాహిని సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో స్వరాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళల్ని, కళాకారుల్ని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, అమీన్‌పాషా, పెద్ది సురేష్, నాదప్రియ, గాయత్రి నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది.

నేడు రాంనగర్‌లో జాబ్ మేళా

ముషీరాబాద్ : ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. రాంనగర్‌లో ఎస్ఆర్‌డీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా జరుగుతుందని, ప్రముఖ కార్పొరేట్ సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. యువతీయువకులకు ఉపాధి రంగంలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు కూడా స్వీకరిస్తామని తెలిపారు.

బడంగ్‌పేట్‌కు తరలిన బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం

- ప్రారంభమైన పాలనా కార్యక్రమాలు

సరూర్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం(ఎమ్మార్వో కార్యాలయం) బడంగ్‌పేట్‌కు తరలిపోయింది. సోమవారం నుంచి బడంగ్‌పేట్‌లోని మునిసిపల్ పాత భవనంలో పాలన కార్యక్రమాలు మొదలయ్యాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు నూతన భవనం నిర్మించిన అనంతరం పాత భవనం ఖాళీగా ఉన్న సంగతి విదితమే. కాగా సదరు భవనాన్ని తమకు కేటాయించేలా చూడాల్సిందిగా తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌ను కోరడంతో ఆయన ఈ మేరకు మునిసిపల్ అధికారులకు లేఖ రాశారు. దాంతో అధికారులు ఆ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి ఇవ్వడానికి అంగీకారం తెలుపడంతో రెవెన్యూ అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో ఏర్పాట్లన్నీ పూర్తయిన తర్వాత సోమవారం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌లోని మునిసిపల్ పాత భవనానికి తరలించారు. ఇకపై బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం బడంగ్‌పేట్‌లోనే కొనసాగనుంది. మొదటిరోజు తహసీల్దార్ కె.మాధవీరెడ్డి కార్యాలయానికి సంబంధించిన సిబ్బందితో సమావేశమై సమీక్ష నిర్వహించారు.



తహసీల్దార్ కార్యాలయంగా మారిన బడంగ్‌పేట్ మునిసిపల్ పాత భవనం

రాజీవ్ గృహకల్ప రోడ్డును సక్రమంగా నిర్మించండి

- అధికారులకు రాజిరెడ్డి వినతి



రోడ్డు అభివృద్ధి కోసం తవ్విన దృశ్యం

సరూర్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పకు నాదర్‌గుల్ రోడ్డులోని మునిసిపల్ నూతన భవనం నుంచి చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులను సక్రమంగా నిర్వహించాలని, భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక 24వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ చప్పిడి రాజిరెడ్డి మునిసిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన అధికారులకు వినతి పత్రం సమర్పించిన అనంతరం మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప రోడ్డును గతంలో వంకరటింకరగా నిర్మించడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఈ దఫా అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా ఉండేందుకుగాను రోడ్డు నడి మధ్య నుంచి ఇరు వైపులా సమాన దూరం ఉండేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటులోనూ నిబంధనలు పాటించడంలేదని, స్ట్రెయిట్ లైన్‌గా కాకుండా జిగ్‌జాగ్‌గా ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం పనులు సక్రమంగా చేపట్టి, విద్యుత్ స్తంభాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలని రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ పలు ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో చెట్లు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ కమలనగర్, లక్ష్మీనగర్, చైతన్యపురి, అష్టలక్ష్మి, వాంబేకాలనీ, శారదనగర్, ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు, 11కేవీ డెంటల్‌కాలేజీ, ప్రజయ్‌నివాస్, గణేష్‌పురి, వాసవీకాలనీ, వెంకటరమణకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5.30 గంటల వరకు, 11కేవీ వాంబేకాలనీ, శారదనగర్, లక్ష్మీగణపతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి 12గంటల వరకు, 11కేవీ లెక్చరర్స్‌కాలనీ, ఆల్‌ఇండియారేడియో ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, 11కేవీ తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం 3.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, 11కేవీ ఎల్బీనగర్, మల్కాపూర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా మంగళవారం 11కేవీ దిల్‌సుఖ్‌నగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఎస్‌బీఐకాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు, ద్వారకాపురం ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4నుంచి 6గంటల వరకు, వేంకటేశ్వరాలయం ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 6నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

హయత్‌నగర్ : రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్‌లను తొలగించేందుకు మంగళవారం విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని అందుకు వినియోగదారులు సహకరించాలని హయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బి. ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. ఆలిండియా రేడియో 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, లెక్చరర్స్‌కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు లెక్చరర్స్‌కాలనీ, వినాయకనగర్ పరిసర కాలనీలు, 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆర్టీసీకాలనీ, సూపర్‌వైజర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఎల్ఐసీకాలనీ, వీరభద్రనగర్ కాలనీల్లో విద్యుత్ నిలిపివేయబడుతుందన్నారు.

యువకుడి అదృశ్యం



గణేష్(ఫైల్)

సైదాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన యువకుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబ్రహ్మణ్యంనగర్‌లో నివాసముంటున్న కె.ఎల్లమ్మ, మల్లయ్య దంపతుల వద్ద మనుమడు గణేష్(22) ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. శనివారం రాత్రి స్నేహితుడిని కలిసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆదివారం ఉదయం వరకు రాకపోవడంతో పాటు గణేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వనస్థలిపురాన్ని మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా: రాగుల



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ ప్రజ్ఞ

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో త్వరితగతిన కృషి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్‌కాలనీ నుంచి అనురాధ కాలనీ వరకు దాదాపు 12కాలనీల వర్షపు నీరు వెళ్లడానికి 1200 డయా పైప్‌లైన్లు పూర్తైనందున ఆ రోడ్డుపై నూతనంగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించడానికి జీహెచ్ఎంసీ ఏఈ ప్రజ్ఞతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మంజూరైన కోటి తొంబై లక్షలతో కూడిన జీహెచ్ఎంసీ నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను అతి త్వరలోనే ప్రారంభించి జూన్ చివరి వారంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. సీఎం సహకారంతో డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి గ్రేటర్‌లోనే వనస్థలిపురం డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు నర్సిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్, ఇంద్రారెడ్డి, శ్రీనివాసరావు, సంతోష్ కురుమ పాల్గొన్నారు.